కథ

# భూతం చేసిన సాయం

కన్నడ కథ : హెచ్. శాంతరాజు ఐతాళ

**ఆ నాటి మధ్యాహ్న భోజనంతో మంపరం ముంచుకొచ్చింది. జొన్నరెట్టెలు, నించుడొంకాయ, కురునూగుల చట్నీ పొడి, దానిమీద గడ్డ పెరుగు లాగించిన నాకు ఆదేం మత్తోగాని, నిద్రాలోకంలోకి మెల్లగా జారుకొన్నాను. భోజనంలో బకాసురుడికి, నిద్రలో కుంభకర్ణుడికి, దీటైన వాడినంటూ నన్నెప్పుడూ పొగడుతూ, ఎంతో తృప్తి పొందే మా ఆవిడ ఆసమయంలో వంటింట్లో మిగిలిపోయిన అడుగుబడుగు రొట్టెల, కూరల స్టాకు ఛెకింగ్‌లో వుండిపోయింది.**

**లేకుంటే అప్పటి నా ప్రతిమాట పలుకు, పని-పాట, నడక-నడతలను ఏదో ఒక రాక్షసవరేణ్యునితో అతిగా పోల్చివుండేది.**

**అవసరమైనప్పుడు ఆమె నన్ను భస్మాసురునిగాను, రసికతలో రావణాసురునిగాను, నడకలో శకటాసురునిగాను, నవ్వడంలో కంసునిగాను సందర్భానుసారంగా పోల్చి పొగడడమే ఆమెలోని ఓ ప్రత్యేకత.**

ఓసారి మా ఆవిడ ఓ విభిన్నమైన విలాసిని మూడ్‌లో వుంది. ఆ అపురూపక్షణం కోసమే కాచుకూర్చొన్న నేను, ఓవికార శృంగారభంగిమలో చేతులూపుతూ, ''సరగున సరసకు రావే చెలి!'' అంటూ అతిమధురంగా పాడాను.

వెంటనే మా ఆవిడ ఓ ఎదురుపూలబాణం విసరుతూ, ''ఆహా! ఏమిపాడారండీ! ఏమీ హావ భావాలు! స్సాక్షాత్ ఆ కీచకుడే వచ్చి నట్టు అయింది.'' అన అనడంతో, నా నోరుండలేక.

''ఎప్పుడొచ్చాడే నీదగ్గరికి, ఆకీచకుడు?'' అంటూ నవ్వుతూనే నోరుజారాను.

దాంతో ఆరోజొచ్చిన నా 'మూడ్'కు కీడొచ్చి పడింది.

మధ్యాహ్నం నిద్రలోకి మెల్లగా జారుకొన్న నాకు కుంభకర్ణుని నిద్రే ఆవహించింది ఆపూట. ఆ నిద్రలో నాకు ఏదో గతుకుల దార్లో, ఓ డొక్కు ఢకలా బస్సులో ప్రయాణం చేస్తున్నట్లు ఓ పీడ కల -

నాముందు ఓ దీనాకృతి ప్రత్యక్షమైంది కూడ అప్పుడే. దాని నెత్తి మీది కావిరంగు జుట్టు, ఏపుగా పెరిగి కోతకుసిద్ధమైన పైరులాగుంది. దానికళ్ళు ఎర్రగా మండుతున్నాయి. నడుము కింది భాగమంతా చేప ఆకృతి. బహుశ అంగవికలుడేమో! పాడు గతుకుల రోడ్డు కదా! పాపం! సీటిద్దామని లేచి నిల్చోగానే, అది తన్నుతాను పరిచయం చేసుకొంటూ,

''నేనో ప్రేతాన్ని, ఏదైనా వరం కోరుకో, ఇస్తాను'' అంది.

''ఓహో! అలాగా! సరే'' విదేశాలు తిరిగిరావాలనే మోజు, మజా, కోరిక లెలాగూ వున్ననాకు - ఇదో సులువైన ఛాన్సు దొరికింది కదా! అంటూ, వెంటనే-

''చూడయ్యా! నాకు ఫారిన్ టూర్ వెళ్లాలనుంది. నా ప్రాణ మిత్రుడు గనుల వ్యాపారంలో దిగి బాగా సంపాదించి, ఓ వోల్వా బస్సే కొన్నాడు. ఓ మాంచిరూటు చూపిస్తే, ఇప్పుడే అన్ని చోట్లకు తిప్పుకొస్తానన్నాడు. నీవు వరమిచ్చేదే నిజమైతే ముందు మనపాత హుబ్లి టోల్ గేట్ నుండి లండన్ దాకా ఓ మంచి పెద్ద రోడ్డేయించు'' అని నామాటలింకా పూర్తికాక మునుపే ఆప్రేతమహాశయుడు బిక్కమొగం వేసుకొని,

''అది అప్రూవుకావడం కష్టం. మరేదైనా కోరుకో. ఇలా తలాతోక లేనివన్నీ కోరొద్దు'' అని గొణిగింది, ఆ అనాథప్రేతం విసుక్కొంటూ.

'మరో వరం ఏది కోరుకొందామా!' అని ఆలోచిస్తుండగానే మాటి మాటికి వాదిస్తూ, ఎదురుతిరుగుతూ, అగ్గిబరాటాలా నాపై ఎగిరే ధర్మపత్ని జయ నాకనులముందు నిలిచింది. వెంటనే-

''ఇదిగో, కోరుతున్నా! నా భార్య నా ప్రతి మాటకు ఊగొట్టేలా చేయాలి మరి, తెలిసిందా!'' అంటూ నా సమస్యను భూతం ముందుంచాను.

అది విన్నభూతానికి దయ్యం పట్టినట్లైంది. ''నాయనా! ఆ లండన్ దారి.. అదేదో ముందడిగావు చూడు- అది బండిదారి చాలా! లేక సిమెంట్ రోడ్డు వేయించాలా! త్వరగా చెప్పు'' అని భూతం తొందర పెడుతున్న సమయంలోనే వంటింట్లోనుంచి ఏదో పెద్దగా శబ్దం. బాండీలో ఏదో వేయిస్తున్నట్లు. దాంతో మెలకువొచ్చింది. నాకల చెదిరింది.

ఈ విషయం వెంటనే జయకు చెప్పాలనుకొన్నా. ఇదే నాకున్న ఒకే ఒక చెడ్డ అలవాటు. ప్రతిదీ జయకు చెప్పడం, అది మా మధ్య మాటల యుద్ధానికి దారి తీయడం, మామూలైపోయింది.

''జయా! మనం ప్రేతమంటాం చూడు! అది కల్లోకొచ్చింది. మజాగా దాంతో కాలక్షేపం చేస్తూ వుంటే, నీ వంటింటి గలబాతో మెలకు వొచ్చేసింది. కరెంటు పోయిన సినిమా కథలా సగంలోనే ఆగిపోయిందది'' అని నేనంటుండగానే, జయ

''అవునులేండి. శెలవు రోజుకూడా ఆఫీసు అమ్మాయిల్నే తలచుకొంటూ పడుకొంటే కల్లో

ప్రేతమూ వస్తుంది, శ్వేత, గీతలు వస్తాయి'' అంటూ ఓ తిరుగుబాటు ఈటెను నామీదికి విసిరింది కోపంగా.

దాంతో నాకు అప్పుడర్థమైంది. ఓసారి ఇంట్లో మా ఆఫీసు స్టెనో శేషాపురాన్ని బాగా పొగిడినట్లు గుర్తు ఆవిడపూర్తి పేరు శేషాపురం శ్వేత. ఆపేరు జయ చెవిన పడి నప్పటినుంచి ఇంట్లో రాద్ధాంతం మొదలైంది.

''ప్రేతమంటే భూతం. తెలిసిందా? ఏ ఆడపిల్లాకాదు'' అంటూ నాకొచ్చిన కలను జయకు వివరంగా వివరిస్తూ మధ్య మధ్య 'హి..హి..హి' అంటూ నవ్వు ముఖం పెట్టాను. కాని జయ మాత్రం గంటు ముఖంతోనే వింటూ, ముగిసేపాటికి మహంకాళిగా మారింది.

ఇక చూస్కో నాయనా! నాపరిస్థితి పెనం మీది పేలాల గత్తైపోయింది.

''కట్టుకొన్న భార్య కదా! అని కూడా చూడకుండా అలా మాట్లాడుతూ వుంటే, ఎవరు కొంటారు? అందుకే రేణుకక్క విడాకు లిచ్చేందుకు కూడా సిద్ధమైందట, నీ మిత్రుడు సదాశివప్పకు, తెలిసిందా!'' అంటూ రుసరుసలాడింది జయ.

''ఆ భాగ్యం అందరికీ ఎక్కడదొరుకుతుంది..?'' అంటూ మనసులోనే గొణుక్కొంటూ, జయ వైపు తిరిగి, ఆశ్చర్యంగా,

''ఏమైందే వాళ్ళకు; అన్యోన్యదాంపత్యం కదా! పార్వతీ పరమేశ్వరుల్లా వుండేవాళ్ళే? ఆమెకా దుర్బుద్ధి ఎందుకు పుట్టిందో? శివ-శివా!'' అంటూ దీనవదనంతో సానుభూతి ప్రకటించా- "ఎందుకంటే జయ 'కేటి.టీ'కి ఎక్కడ ఎసరు పెడుతుందోనని.

''ఆమె బుద్ధి కాదండి. అది మీ సదాశివప్ప గారి దుర్బుద్ధి మీ మగజాతే అంత. రోజూ సాయంకాలం ఆఫీసునుండి వచ్చింది మొదట ప్రారంభిస్తాడట. 'మా ఆఫీసులో ఓ ఆవిడముఖం కరీనాకపూర్ లాగుందని, ఇంకో ఆవిడ నడుము రమ్యకృష్ణలా వుంటుందని, మరోదాని ఎదలు అదెవతో బిపాశా... లా వుంటాయని. అలాంటి సుందరీమణుల్ని వదిలేసి ఈ అడవిదున్నతో కాపురం చేస్తున్నా చూడు' అని దెప్పిపొడుస్తాడట. రోజంతా ఆ మాటలు వినీవినీ తలవాచిపోయిందట. అందుకే ఆవిడంది. 'సినిమాల్లో చెప్పాలా! చక్కనైన సుందరీమణులకేం కొదువ? అన్నీ విడిచినవి, అన్నీ విప్పేసి ఎగిరే పోకిరివి వుంటాయక్కడ. వాటివెనకే వెళ్లండి. కాదన్నదెవరు? ఇదిగో నేనీ క్షణమే మా పుట్టినింటికెళుతున్నా! ఒక్షణమిక్కడుండను. తెలుసా!' అంటూ పెద్దగా పోట్లాడుకొని విడాకులకు కూడ సిద్ధమైందట'' వీరనారి 'హేమారెడ్డి మల్లమ్మకథ చెప్పేతీరులో ఊగిపోతు ఆక్రోషంగా మాట్లాడింది జయ.



నేను మరికొన్ని వివరాలు తెలుసుకొనే ప్రయత్నం చేస్తూ, ''ఆ తలాక్, గిలాక్ ఏదీ నాకివ్వొద్దుగానీ, అర్జంటుగా ఓమంచి 'కేటి.టీ' ఇవ్వడం మాత్రం మరచిపోకు'' అన్నాను చూద్దామని.

''ఊ- ఇస్తానిస్తాన్. కలగంటూ వుండండి- కల. తలాక్ ఇచ్చేస్తే ఆ లిల్లీనో, ఆశ్వేతానో కట్టుకొందామని కదూ!'' అంది జయ కోపంగా.

''సరిసరి - నీమాటలకేంగాని. ఏ శేషాపురం శ్వేత లేదు ఏ లీలాపురం లిల్లీలేదు. మా ఆఫీసులో అసలు ఆడాళ్ళే లేరు. నీవన్ని అపద్ధాలు. ఇంతకూ టీ తెస్తావా! లేక పోతే ఈ ఖాళీ కాగితం మీద తలాక్ నా కిష్టమే' అని సంతకం పెడతావా!'' అన్నాను ధైర్యంగా. క్రితంలో ముద్దణ్ణ ఓసారి తన భార్య మనోరమను ఇట్లే బెదరించాడట. అది విన్న నేను ఆ ప్రయోగం చేసాను కోపంగా, చూద్దామని.

మా ఆవిడను ఓ విషయంలో మాత్రం మెచ్చుకోవలసిందే. అది మా ఆవిడ చేసిచ్చే 'వహ్వా - తాజ్' కడక్ టీ అని వేరుగా

చెప్పవలసిన పనిలేదు. ఈ విషయం జయకు కూడా బాగా తెలుసు.

ఆవిడెప్పుడూ తన ఫ్రెండ్సుతో ''మావాళ్ళు నాతో ఇంట్లో మాత్రమే పోట్లాడుతారు. అది నిజం. కాని నా చేతి టీని మాత్రం అందరి ముందు భేషుగ్గా పొగడుతారు. అది మామధ్యన వున్న కలుపుగోలు తనమే కాని మరోటి కాదు'' అని అనడం నే చెవులారా విన్నాను కూడ.

ఇంతలోనే జయ నా మీద వేడివేడి చూపులు సారిస్తూ, ''మీది నటనో, నిజమో! ఏ ఒక్కటీ అర్థం కాదు. మీకు కావాల్సింది 'టీ' కదా! ఇదిగో ఇప్పుడే తెస్తాను మగడా! మీతల్లో దూరిన ఆ తలాక్ పిచ్చి మాత్రం ముందు తొలగించుకోండి. శివ, శివా!'' అంటూ మృదుగా మందలించింది. దాంతో నా ఆనందానికి అవధులు లేకుండా పోయింది.



ఏది ఏమైతేనేం! టీ రానే వచ్చింది. అంతలోనే సొంత కవిత ఒకటి నాదైన సొంత బాణిలో... ''ఈ కలహాల కాపురం – తీపి చేదుల కమ్మదనం. దివినే తాకిందే చెలి!...'' అంటూ పాడడం మొదలుపెట్టాను.

''అబ్బాబ్బా! ఆపండీ. ఆ కప్పులగోల! తీపి చేదుల కమ్మ దనమట, గుంటూరు మిర్చి తియ్యదనమట. బాగుంది లేండి. ముందు ఈ టీ తాగండి.'' అంటూ జయ ఓ అపూర్వమైన నవ్వు ముఖంతో ఆజ్ఞాపించింది. అందుకొన్న టీ చప్పరిస్తూ ''అంతకూ జయ అని నీకీ పేరు ఎవరు పెట్టారోగాని, జయ అంటే ఏమిటో తెలుసా!'' అని అడిగాను నవ్వుతూ.

''ఆ తెలుసు లేండి! నేనేం అమాయకురాల్ని కాదు. జయ అంటే సక్సస్ అని. క్రికెట్‌లో, ఎలక్షన్సులో మనం సాధిస్తాం కదా! అది. మా అమ్మా నాన్న బాగా ఆలోచించే పెట్టారా పేరు. అదే – మీ పేరు చూసారూ! శివ..శివా! త్రీ ఇన్ వన్. రుద్రమునిస్వామి ఆహాహా ఎంత చక్కని పేరు, ఏమి కథా!'' అంటూ కోపంగాను, చురుగ్గాను విసిరే మా ఆవిడ ఆ దెప్పిపొడుపు మాటలు నాపాలిటికి ఎదురుకొరడా దెబ్బలే అయ్యాయి.

ఇక ఇలాగే వారాలకొద్ది మా మధ్య మాటల యుద్ధం కొనసాగితే నా మర్యాద కాస్తా గంగలో కలిసినట్లే – నని భయపడి వెంటనే.

''తప్పు తప్పు.. మీలాంటి పతివ్రతా స్త్రీలు మగనిపేరు పలికితే ఏమైనా వుందా! మగాడికి ఆయుషు తగ్గిపోదూ! మన పూర్వీకులు, ఋషులు మహాభారతానికి 'జయ' అనికూడ పేరుపెట్టారు–తెలుసా! జయ అంటే మహాభారతమే నడుస్తూవుంటుంది'' అన్నాను, నాటకీయంగా నవ్విద్దామని.

''అవునులేండి! నేను జగడాల మారినే! మీరు మాత్రం మఠం స్వాములు కదా! పాపం!'' అంటూ కట్టలు తెంచుకొస్తున్న దుఃఖంతో తన అంబులపొదినుండి ఓ కట్టకడపటి అస్త్రాన్ని తీసి నాపైకి సంధించింది కోపంగా.

దాంతో ఆనాటి రాత్రి నా పరిస్థితి చాల విషమంగా మారింది. నే కొంత నియంత్రణ పాటించక తప్పలేదు.

మరుసటి రోజు ఆఫీసులో ఇన్‌స్పెక్షన్ కావడంతో ఫైళ్ళు, డే బుక్స్, అకౌంటు లెడ్జర్లు, క్యాష్ బుక్స్‌లో పూర్తిగా మునిగిపోయాను. వరుసగా నాలుగు నాళ్ళ ఇన్‌స్పెక్షన్‌తో నా పని మూడొంతులు, జీతం ఒకవంతుగా మారిందనిపించింది. ఈ గుమాస్తాగిరికి, ఆఫీసు జవానుకు పెద్ద తేడా ఏం లేదని అందరూ అనుకొనే మాట అక్షరాల నిజమైందని గొణుక్కొంటూ గాడిద చాకిరి చేసాను. దాంతో ఐదోరోజు ఉదయం మంచం లేవలేక పోయాను.

తలపైకెత్తలేక, తలపట్టుక కూర్చొన్నాను. నాకళ్ళముందే అన్నీ తిరుగుతున్నాయి. మంచం, గదితో సహా అన్నీ గిరగిరా తిరుగుతున్నాయి. ''భగవంతుడా! ఇదేమిట్రా తండ్రీ! శ్రీగురు రాఘవేంద్రా! కాపాడు'' అంటూ చేతులెత్తి మొక్కుకొన్నాను.

ఇంతలో జయ ''ఏమండీ! ఎనిమిదైంది ఆఫీసులేదా! ఇన్‌స్పెక్షన్ తరువాత బడికి శెలవిచ్చినట్లు మీకు ఇచ్చారా! ఏం?'' అంటూ గదిలో కొచ్చి నా పరిస్థితి చూచి కంగారుపడిపోయింది.

''ఏమిటండీ! ఏమైంది? అయ్యో దేవుడా!'' అంటూ ఏడ్వడం మొదలుపెట్టింది. ఆవిడ కళ్లల్లో 'మలప్రభా కృష్ణలు' గలగలా పారాయి. ''ఏం కాలేదు లేవే! భయపడొద్దు. తలతిరిగిందంతే. కూర్చోలేక పోతున్నాను'' అంటూ మూలుగుతూ జవాబిచ్చాను.

జయ ఏడ్పులు విన్న పక్కింటి పరమేశ్వరప్ప, భాగ్యమ్మలు అప్పుడే పరిగెత్తుకొచ్చినట్లు నాకర్థమైంది.

''అయ్యో! వదినా! 108కు ఫోను చేసి అర్జంటుగా హాస్పటల్‌కు తీసుకెళదాం'' అంటూ వాళ్ళు ఆతురత కనపరచారు.

దాంతో నేను మరో పదినిమిషాల్లో డాక్టర్ ఊకుగప్పగారి దగ్గరున్నాను. అపాటికే జయ సగం పిచ్చిదైనట్లుంది. మధ్యాహ్నం డ్రిప్పు ఎక్కించారు. తల తిరగడం కొంతవరకు తగ్గింది. సాయంత్రానికల్లా వాషింగ్‌మిషన్‌కు టైం ఫిక్స్ చేసినట్లు నా తల తిరగడం పూర్తిగా తగ్గిపోయింది.

ఆ నాలుగురోజులు జయ హాస్పటల్‌లో నా దగ్గరే వుంది. సపర్యలు చేస్తూ వుంటే- రోజు ఇంట్లో మహాభారతయుద్ధం చేసే 'జయ' నిజంగా ఇదేనా! అని అనిపించింది.

శ్రద్ధ, ప్రేమ, ఆప్యాయత, ఆదరణ, అనురాగ రసికతలన్నీ మూర్తీభవించిన స్త్రీమూర్తిలా జయ కనిపించింది నాకప్పుడు.

కోలుకోలేని స్థితిలో వున్న నా ఆరోగ్యం కాస్తా ఆ సేవలతో నాలుగు రోజుల్లోనే కుదుటపడింది.

ఐదో రోజుకల్లా డి ఛార్జ్ ఇల్లుచేరిన నేను ''అబ్బ! పునర్జన్మ ఎత్తినట్లైంది జయా! హాస్పటల్‌లో ఏనర్సు నన్నుతాకకుండా అన్ని సేవలు నీవే చేసావు. యూ ఆర్ మై బెస్ట్ వైఫ్'' అంటూ పొగడాను సంతోషంగా.

''అవునులేండి ఆ ఎర్రగా బుర్రగా వుండే నర్సు నేనుండగానే మీకు స్పాంజ్‌బాత్ చేయిస్తానని వచ్చిన తరువాత, ఇంక బెస్ట్‌వైఫ్ ఎలా అవుతాన్నేను? మీ అవసరాలకు తగిన బెటర్ వైఫ్‌లున్నప్పుడు ఇంక నేనెందుకు''? అంటూ ఏదో ఒక వంక పెట్టి మళ్ళా మొదట కొచ్చింది జయ.

జయ మాటలతో హడలిపోయాను. మా దాంపత్య రథం మళ్ళీ ఎక్కడ పాతగతుకుల బాటలో నడుస్తుందోనని భయపడి వెంటనే - ''అటులో, ఇటులో ఎటులో - నాకల నిజమైందే చెలి! ఈ కలహాల కాపురం తీపి చేదుల కమ్మదనంతో దివిని తాకిందే చెలి!'' అంటూ ఏ అడ్డులేని బ్యాక్ ఆన్ ట్రాక్‌పై నా బండిని సాదాసీదాగా నడిపించడానికి నా ఫేవరిట్ సాంగ్‌ను ప్లే చేసాను.

దాంతో జయ ''నాథా! ఆ కప్పలగోల ఆపి పడుకొంటారా! ఈసారి కల్లోకి ఆ శ్వేత, గీత లెవరైన వస్తే నన్ను పిలవండి. దొడ్లో ఐదురోజుల అంట్లు పడున్నాయ్ వాళ్ళతో తోమిస్తా..'' అంటూ ప్రేమగా నవ్వుల పువ్వులు కురిపిస్తూ నా కౌగిట్లో వాలిపోయింది.

★


- కల్లూరు రాఘవేంద్రరావు

డోర్ నెం. 26-4-982, త్యాగరాజనగర్,

హిందూపురం - 515 201.

ఫోన్: 9490421673


**కథాకళి**

# జరగని నష్టం... లాభమే!

'నాన్నా, పొద్దున్నే సూర్య నమస్కారాలు చేయాలని మా టీచర్ చెప్పింది? ఎందుకు?' అడిగింది పదేళ్ల అనూష!

'సూర్యుడు తేజో రాశి. నిత్య చైతన్య శీలి. సూర్యునికి నమస్కారం చేయడం వల్ల ఆయన తనలోని కాంతిని, చైతన్యాన్ని మనకు అందిస్తాడన్నమాట' చెప్పాడు రామారావు.

'పిల్లలంతా రోజూ సరస్వతీ దేవిని ప్రార్థించాలని కూడా చెప్పింది టీచర్. ఎందుకు?' మళ్లీ అడిగింది కూతురు.

'సరస్వతీ మాత సకల విద్యలకూ తల్లి. ఆమెను ప్రార్థిస్తే ఆమె వద్ద ఉన్న విద్యల్లో కొన్నింటిని మనకు ప్రసాదిస్తుంది' చెప్పాడు తండ్రి.

'మరి అమ్మ పొద్దున్నే లక్ష్మీదేవికి పూజ చేస్తుంది కదా! ఎందుకు?' 'లక్ష్మీదేవి సకల సంపదలకు సామ్రాజ్ఞి. అంటే అన్ని సంపదలూ ఆమె వద్ద ఉంటాయన్నమాట. లక్ష్మీదేవిని పూజిస్తే, ఆమె మనల్ని అనుగ్రహించి మనకూ ఆ సంపదలను ఇస్తుంది.'



'రోజూ ప్రతి ఒక్కరూ భూదేవిని తలచుకుని పూజించాలని గుళ్లో పూజారిగారు చెప్పారు. ఎందుకు?'

'భూమి మనం ఉండడానికి వసతి కల్పిస్తుంది. మనకు ఆహారాన్ని ఇస్తుంది. మనం తొక్కినా, గోతులు తీసినా, ఎన్ని కష్టాలు పెట్టినా భరిస్తుంది. అందుకే మనం భూదేవిని తలచుకుని కృతజ్ఞతలు చెప్పుకోవాలి.'

'నాన్నా... సూర్యుడు, సరస్వతి, లక్ష్మీదేవి, భూమి వీళ్లంతా మనకు ఏదో ఒకటి ఇస్తున్నారు. అందువల్ల వారిని పూజించాలి. సరే! మరి ఏనుగు ముఖంతో ఉండే విఘ్నేశ్వరుడిని మనం ఎందుకు పూజించాలి? ఆయన వద్ద ఏం ఉంటాయి? ఆయన మనకేం ఇస్తాడు?' అడిగింది కూతురు.

'విఘ్నేశ్వరుడి వద్ద విఘ్నాలు ఉంటాయి. వాటిని మనకు ఇవ్వకుండా ఉండడానికి మనం విఘ్నేశ్వరుడిని పూజించాలి' చెప్పాడు తండ్రి.

నీతి: ఈప్రపంచంలో ఒక్కొక్కరిదీ ఒక్కో గుణం. వారివారి సహజ స్వభావాలు ఏవైనా మనం మాత్రం అందరితో మంచిగా ఉండడానికే ప్రయత్నించాలి. మంచిని (వరాలు) పొందడానికి కొందరితో బాగుంటే, చెడు (శాపాలు) ఎదురుకాకుండా ఉండడానికి మరికొందరితో మంచిగా ఉండాలి. ఏదైనా పొందడానికి కొందరిని ప్రార్థిస్తే, నాకు ఎదురుపడకుండా ఉండమని ఇంకొందరిని ప్రార్థించాలి. లాభం కోసం పరితపించడం ఎంత అవసరమో, నష్టం జరగకుండా చూసుకోవడం కూడా అంతే ముఖ్యం. నష్టం జరగకపోతే, లాభం జరిగినట్టే కదా!

- తిగుళ్ళ కృష్ణమూర్తి